సాక్షి
అనకాపల్లి
బుధవారం। 31। జూలై। 2024


స్లీపర్‌లో కిక్కిరిసిన ప్రయాణం


గౌహతి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వద్ద ప్రయాణికుల రద్దీ


గోదావరి ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌ల వద్ద ప్రయాణికుల పాట్లు

రైలు బండి.. చోటేదండీ?

- భారమవుతున్న రైలు ప్రయాణం
- జనరల్, స్లీపర్ కోచ్‌ల కుదింపుతో ఇబ్బందులు
- స్లీపర్, థర్డ్ ఏసీలో రిజర్వేషన్ దొరక్క అవస్థలు
- దువ్వాడ మీదుగా రాకపోకలు సాగిస్తున్న 30కి పైగా రైళ్లు
- సాధారణ ప్రయాణికులపై రైల్వే చిన్నచూపు

విశాఖ రైల్వేస్టేషన్.. సాయంత్రం 5 గంటలు.. డిబ్రూగడ్-కన్యాకుమారి వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా మూడో నెంబర్ ప్లాట్‌ఫాంపైకి వచ్చింది. ప్రయాణికులు గుంపుగా చేరిపోయారు. అప్పటికే జనరల్ బోగీ ప్రయాణికులతో కిక్కిరిసింది. తొక్కేసుకొని ఏదో రకంగా ఎక్కేశారు. కాలు దూరే ప్లేస్ ఉంటే చాలు.. అదే ఏసీ బెర్త్ అంటూ దూసుకెళ్లారు. వందేభారత్‌లు.. అమృత్‌లు బదులు.. ఉన్న రైళ్లకు అదనంగా రెండు జనరల్ బోగీలు ఏర్పాటు చేయవచ్చు కదా అంటూ రైల్వే శాఖను తిట్టిపోసుకుంటూ బయలుదేరారు.

సాయంత్రం 5 గంటలు.. గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం 8పైకి వచ్చింది. జనరల్ బోగీ కేవలం 2 నిమిషాల్లోనే కిక్కిరిసిపోయింది. కనీసం బాత్‌రూమ్ వైపు వెళ్లేందుకు కూడా అడుగు జాగా లేకుండా పోయింది. సాయంత్రం ఎక్కితే ఉదయాన్నే సికింద్రాబాద్‌లో దించేసే రైలు కాబట్టి.. కనీసం నిలబడి వెళ్లిపోతే చాలు.. అదే పదివేలు అంటూ నిట్టూరుస్తూ ప్రయాణికులు భాగ్యనగరం పయనమయ్యారు.

మధ్యాహ్నం 1.50 గంటలకు వచ్చే గౌహతి ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇదే సీన్ రిపీట్.. ఈ మూడు రైళ్లే కాదు.. ప్రతీ రైలులోని జనరల్ బోగీలో ప్రయాణమంటే యుద్ధమే. గమ్యస్థానం చేరేలోపు కూర్చోడానికైనా.. కుదరుగా నిల్చోడానికైనా ప్లేస్ దొరకబుచ్చుకున్న పేదోడే రారాజు. అలా మారిపోయింది.. కాదు కాదు.. మధ్య తరగతి ప్రయాణాన్ని అలా మార్చేసింది రైల్వే బోర్డు.

సాక్షి, విశాఖపట్నం/తాటిచెట్లపాలెం : నిత్యం లక్షలాది మంది ప్రయాణం చేసే వాల్తేరు రైల్వే స్టేషన్‌లో రైలెక్కే సామాన్యుడి పరిస్థితి దయనీయంగా ఉంది. సీట్లు తక్కువగా ఉండటం, స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు సర్వసాధారణంగా మారిపోయాయి. ఇదే సమయంలో దూర ప్రాంత ప్రయాణాలకు అనువుగా ఉండే రైళ్లలో స్లీపర్ కోచ్‌ల కుదింపు ప్రక్రియను రైల్వే మంత్రిత్వ శాఖ అమలు చేయడంతో రైలు ప్రయాణం మరింత భారంగా, భయంగా మారిపోయింది. జనరల్ కోచ్‌లతో సమానంగా రిజర్వ్‌డ్ క్లాస్ కోచ్‌లు కిక్కిరిసిపోతుండటంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. విశాఖ నుంచి బయలుదేరిన మూడు రైళ్లను 'సాక్షి' పరిశీలించగా.. ఈ విషయం తేటతెల్లమైంది.

- గౌహతి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మంగళవారం కిక్కిరిసి విశాఖపట్నం చేరుకుంది. ఈ రైలులో జనరల్, స్లీపర్ క్లాస్‌లలో కనీసం కాలుమోపేందుకు కూడా ఖాళీ లేదు. ఈ రైలులో 4-జనరల్, 7-స్లీపర్ కోచ్‌లుండగా మిగిలిన 8 ఏసీ కోచ్‌లే. ఓ జనరల్ కోచ్‌లో 108 మంది వరకు ప్రయాణించవచ్చు. కానీ ఈ రైలులోని ఒక్కో జనరల్ కోచ్‌లో 200 మంది కంటే ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారు. స్లీపర్ క్లాస్ కోచ్‌ల్లో కేవలం 78 బెర్తులు మాత్రమే ఉంటాయి. కానీ ఈ రైలులోని స్లీపర్ క్లాస్ కోచ్‌ల్లో సుమారు 150 మంది చొప్పున ప్రయాణికులున్నారు.
- డిబ్రూగడ్-కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ కూడా ఇదే విధంగా వెళ్లింది. ఈ రైలులో కేవలం మూడు కోచ్‌లను మాత్రమే సాధారణ ప్రయాణికులకు కేటాయించారు. 11 స్లీపర్, 5 ఏసీ కోచ్‌లు ఉన్నాయి. ఈ రైలులో కూడా సాధారణ, స్లీపర్ కోచ్‌ల్లో ఒక్కోదాంట్లో 150 మందికి తక్కువ కాకుండా ప్రయాణిస్తున్నారు. జనరల్ కోచ్‌ల్లో ఒక్కో సీటులో నలుగురు కూర్చోవచ్చు. కానీ కనీసం ఏడుగురు కూర్చున్నారు.
- ఉత్తరాంధ్ర వాసుల ప్రధాన రైలు గోదావరి ఎక్స్‌ప్రెస్. ఈ రైలు ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతం. ఈ రైలులోని జనరల్ కోచ్‌ల్లో కనీసం కాలుమోపలేం. కారణం ఈ రైలుకు ఉన్నవి కేవలం రెండే జనరల్ కోచ్‌లు. వాటిలో ఒక కోచ్ సగం ఆర్ఎంఎస్‌కు కేటాయిస్తారు. దీంతో జనరల్ కోచ్‌ల్లో ప్రయాణించడం **అసాధ్యం. ఇక ఈ రైలుకు గతంలో 12 స్లీపర్ క్లాసు** కోచ్‌లుండేవి. కానీ ప్రస్తుతం వీటి సంఖ్య 8కి పడిపోయింది. స్లీపర్ క్లాస్ కోచ్‌ల స్థానంలో ఏసీ కోచ్‌లను జతచేసి.. స్లీపర్, జనరల్ కోచ్‌లను తగ్గించేసింది.


డిబ్రూగడ్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ స్లీపర్ క్లాస్ కోచ్‌ల వద్ద రద్దీ


6 గురు ప్రయాణించే సీట్లలో పది మందికి పైనే..

ప్రధాన రైళ్లు రద్దు.. స్పెషల్ రైళ్ల వైపు మొగ్గు

ప్రయాణికులకు అత్యంత డిమాండ్ ఉన్న రైళ్లను సైతం తరచూ రద్దు చేస్తోంది. దీని వల్ల మధ్య తరగతి కుటుంబాలకు ప్రయాణాలు చేయాలంటే కష్టంగా మారింది. గత ఆరు నెలల నుంచి విశాఖపట్నం-విజయవాడ మధ్య పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు రద్దు చేశారు. ఇదే మార్గంలో నడిచే వందేభారత్ రైళ్లు, పలు స్పెషల్ రైళ్లు మాత్రం యథావిధిగా నడుస్తున్నాయి. దీంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉన్న కొద్ది పాటి రైళ్లలో సాధారణ, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తగ్గించి, ఏసీ కోచ్‌ల వైపు రైల్వే మొగ్గు చూపుతోంది. దీంతో కొన్ని సార్లు స్లీపర్ క్లాస్ కోచ్‌లు కూడా సాధారణ కోచ్‌ల కంటే దారుణంగా ఉంటున్నాయి.

బైపాస్‌తో మరింత భారం

విశాఖ రైల్వేస్టేషన్‌లో మొత్తం 8 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. అయితే రైళ్ల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో శివార్లలో రైళ్లను గంటల తరబడి నిలిపేస్తున్న పరిస్థితుల దాపురించాయి. అందుకే కొన్ని రైళ్ల సర్వీసులను దువ్వాడ వైపుగా దారి మళ్లించేస్తున్నారు. విశాఖకు రాకుండా ప్రస్తుతం 30కి పైగా రైళ్లు బైపాస్ నుంచి వెళ్లిపోతుండటం ప్రయాణికుల కష్టాలను మరింత పెంచుతున్నాయి.

వెయిటింగ్ కంటే.. ఇదే నయం

సాధారణంగా రైలు ప్రయాణమంటే.. కచ్చితంగా ముందస్తు ప్లాన్ అవసరం. మూడు నెలల ముందే రిజర్వేషన్ ఓపెన్ చేస్తారు. కేవలం రోజుల వ్యవధిలోనే దాదాపు 80 శాతం రైళ్ల సీట్లు రిజర్వ్ అయిపోతుంటాయి. ఇక వెయిటింగ్ లిస్ట్ చూస్తే.. 150, 200, 250.. ఇలా సెంచరీల మీద సెంచరీలు కొడుతుంటుంది. వెయిటింగ్ లిస్ట్‌పై స్లీపర్ క్లాస్‌లో వెళ్లి.. అందరితో చీవాట్లు తినే బదులు.. జనరల్ బోగీలో వెళ్లి కాస్తా ఓపికపడితే చాలు అని ప్రతి ఒక్క ప్రయాణికుడు భావిస్తున్నారు.

ఏసీ కోచ్‌లకు డిమాండ్

స్లీపర్ కోచ్‌లు రిజర్వ్ ఫుల్ అయిన వెంటనే.. థర్డ్ఏసీ, సెకండ్ ఏసీ, ఫస్ట్‌క్లాస్‌పై పడుతున్నారు. దీంతో ఆ బోగీలకు కూడా డిమాండ్ పెరిగిపోతోంది. అందుకే స్లీపర్, జనరల్ బోగీలు తగ్గించి.. ఆదాయం పెంచుకునేందుకు రైల్వే శాఖ ఏసీ కోచ్‌లు పెంచుతోంది.


జనరల్ కోచ్‌లను తలపిస్తున్న స్లీపర్ కోచ్


స్లీపర్ కోచ్‌లో ప్రయాణికుల అవస్థలు



జనరల్ బోగీ.. కిక్కిరిసి..

ప్రతీ రోజు గోదావరి ఎక్స్‌ప్రెస్ పరిస్థితి ఇంతే. జనరల్ కోచ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నాం. విజయవాడ వరకు వెళ్లేందుకు ఈ రైలెక్కా. ఇది తప్ప వేరే రైలు లేకపోవడంతో అందరూ ఇదే రైలుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ రైలులో జనరల్ కోచ్‌లు కేవలం రెండే ఉన్నాయి. స్లీపర్ కోచ్‌ల్లో ఎక్కాలంటే ఫైన్ కట్టాలి. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా వేలాడుతూ వెళ్తున్నా..

– పి.ప్రవీణ్, శ్రీకాకుళం



రైల్వే మినిస్టర్ సార్ నా వల్ల కాలేదు

మూడు నెలల ముందు నుంచి టికెట్ బుక్ చేసుకోడానికి ట్రై చేసినా కుదరలేదు. గోదావరికి టికెట్ దొరకడం గగనమైపోయింది. అర్జెంట్ పని ఉండి హైదరాబాద్ వెళ్లేందుకు గోదావరి కోసం వచ్చాను. జనరల్ బోగీ ఎక్కాలని ప్రయత్నించాను. నా వల్ల కాలేదు. అయ్యా.. రైల్వే మినిస్టర్ సార్.. దేశంలో రైళ్లలో ప్రయాణించే వారిలో ఎక్కువ మంది సాధారణ ప్రయాణికులే ఉంటారు.

– ఎస్.ఈశ్వరరావు, ప్రయాణికుడు



కోయంబత్తూరు వరకూ ఇలాగేనా..

మాది శ్రీకాకుళం జిల్లా. మేం కోయంబత్తూరులో పనిచేస్తున్నాం. వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో శ్రీకాకుళం స్టేషన్‌లో ఎక్కాం. ఇద్దరం నిలబడటానికి కొంత ప్లేస్ దొరికింది. విజయవాడ వైపు వెళ్లే కొద్దీ రష్ పెరుగుతుంటుంది. అప్పటికి ఈ ప్లేస్ ఉంటుందో లేదో కూడా తెలీదు. దాదాపు 1,300 కిలోమీటర్లు వెళ్లాలి. రెండు రోజులు పడుతుంది. కోయంబత్తూరు వెళ్లేంత వరకూ ఈ నరకయాతన తప్పదు.

– దుర్గాప్రసాద్, రమేష్, ప్రయాణికులు



స్లీపర్ కోచ్‌లు పెంచాలి

ఎంతో ముందుగా రిజర్వేషన్ చేయించుకున్నా సీటు కన్ఫర్మ్ కాలేదు. ప్రయాణం చేయాల్సిన అవసరం ఉండటంతో సీటు లేకున్నా అడ్జస్ట్ అయి వెళ్తున్నా. అందరూ ఏసీ కోచ్‌ల్లో ప్రయాణించ లేరు కదా! స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఎక్కువ వేస్తే ఉపయోగంగా ఉంటుంది. జనరల్ ప్రయాణికులు కూడా రిజర్వేషన్ బోగీల్లో ఎక్కడం వల్ల రిజర్వేషన్ చేయించుకున్నా ఉపయోగం లేకుండా పోతోంది. జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌ల సంఖ్యను పెంచాలి.

– పి.భవేష్‌కుమార్, బెంగళూరు

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి: ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా 2024-25 సంవత్సరంలో టెన్త్, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 నుంచి ఆగస్టు 27వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని, ఫీజు చెల్లించడానికి చివరి తేదీ ఆగస్టు 28 అని పేర్కొన్నారు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 4వ వరకు గడువు ఉందని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు www.apopenschool.ap.gov.inను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఖరీఫ్‌కు ఢోకా లేకుండా సాగునీరు


రావణాపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ: ఖరీఫ్ సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రావణాపల్లి రిజర్వాయర్ ఆయకట్టుకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టినట్టు అసెంబ్లీ స్పీకర్ సీహెచ్. అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఇటీవల తుపాను సమయంలో కుడికాలువకు పడిన గండిని పూడ్చే పనులను అత్యవసర నిధులు రూ.2లక్షలతో యుద్ధ ప్రతిపదికన పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజర్వాయర్ కాల్వలలో పూడిక తీత పనులను ముందుగానే పూర్తి చేయాలన్నారు. రావణాపల్లి రిజర్వాయర్ గర్భంలో చేపల వేట కోసం ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్‌తో పాటు వలలను తొలగించాలని ఆదేశించారు. నర్సీపట్నం ఆర్డీవో జయరాం, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

1,2 తేదీల్లో శతశాతం పింఛన్ల పంపిణీకి చర్యలు

తుమ్మపాల: వచ్చేనెల 1,2 తేదీల్లో ఇంటింటికీ తిరిగి సామాజిక భద్రత పింఛన్లను శతశాతం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. జులై నెలకు సంబంధించి జిల్లాలో 2,62,624 మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. పింఛన్‌దారులు తప్పనిసరిగా ఇంటి వద్దనే ఉండి, నగదు పొందాలని ఆమె కోరారు.

చిత్తశుద్ధితో సూపర్ సిక్స్ అమలు చేయాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు పలు హామీలిచ్చిన చంద్రబాబునాయు అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలను ఇస్తామంటూ ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయలేదని తెలిపారు. రైతులు ఆ సాయం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ.15వేలు ఇస్తామంటూ ఇచ్చిన హామీ అమలు కాలేదని, దీంతో ప్రైవేటు స్కూళ్లలో పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని ప్రకటించారని, అది కూడా అమలుకాలేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న ఇసుక ధర కంటే కూటమి ప్రభుత్వంలో ధర అధికంగా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాల్సిన ప్రభుత్వం దాడులు చేస్తోందని, వ్యక్తిగత కక్షలతో టీడీపీ నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు మేలైన సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో వాడ్రాపల్లి, నారాయుడుపాలెం సర్పంచ్‌లు కాండ్రేగుల నూకరాజు, కోరుకొండ వెంకట్ రాజు, ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు, ఇల్లా శిరీష నాగేశ్వరరావు, పాలసంఘ అధ్యక్షులు శరగడం జగన్నాథరావు, పార్టీ నేతలు భీశెట్టి ధనశ్రీను, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలపై కదలిక


- బకాయి బిల్లుల ఫైళ్లు సిద్ధం చేసిన ఎంపీడీవోలు
- వెంటనే కూలీలకు చెల్లించాలని రైతు సంఘాల డిమాండ్

సాక్షి ఎఫెక్ట్..

యలమంచిలి రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో పనులు చేసిన కూలీలకు రెండున్నర నెలలుగా బకాయి పడిన వేతనాల చెల్లింపు ప్రక్రియకు కదలిక వచ్చింది. ఈ ఏడాది మే 21 నుంచి వేతనాల చెల్లింపు జరగకపోవడంతో పనులు చేసిన కూలీలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను 'ఊసేలేని ఉపాధి వేతనాలు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టరు, డ్వామా పీడీల ఆదేశాలతో బకాయి పడిన వేతనాల ఫైళ్లను నరేగా ఏపీడీలు, ఎంపీడీవోలు ఈ ఆఫీసు పద్ధతిలో సోమ, మంగళవారాల్లో క్లియర్ చేశారు. మునగపాకకు చెందిన సీఐటీయూ, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు ఉపాధి కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మునగపాక ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. దీనికి స్పందించిన మునగపాక ఎంపీడీవో కూలీల వేతనాల చెల్లింపు ప్రక్రియ మండల స్థాయిలో పూర్తి చేశామని, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే చెల్లింపులు పూర్తవుతాయని సాక్షికి రాతపూర్వకంగా తెలియజేశారు. తమకు వీలైనంత త్వరగా బకాయి ఉన్న వేతనాలు చెల్లించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- ప్రమాదాలు తగ్గేలా చర్యలు: ఎస్పీ దీపిక


పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ దీపిక

పరవాడ: పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగడంతో పాటు వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. పరవాడ పోలీస్ స్టేషన్‌ను ఆమె మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించారు. పారిశ్రామిక ప్రాంతంలో జరిగే ప్రమాదాలపై సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి ఆయా కేసుల పురోగతిని తెలుసుకొని సిబ్బందికి ఎస్పీ దీపిక తగు సూచనలు చేశారు. అలాగే సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ ఎస్.బాలసూర్యారావు, ఎస్ఐ మల్లేశ్వరావు, సిబ్బంది ఉన్నారు.

యాజమాన్యం వేధింపుల వల్లే మాధురి ఆత్మహత్య



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత రాజాన దొరబాబు


మాధురి ఆత్మహత్యపై నిరసన తెలుపుతున్న కుటుంబీకులు, సిటు నాయకులు

- సమగ్ర విచారణ జరపాలని ఏఐటీయూసీ, సిటు డిమాండ్

అనకాపల్లి: అచ్యుతాపురం మండలంలోని తాన్‌యాన్ గార్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం వేధింపులు కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన నక్క మాధురి మృతిపై సమగ్రమైన విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాధురిని యాజమాన్యం తీవ్రంగా వేధించడం వల్లే ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సంబంధిత అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీలో జరుగుతున్న వేధింపులు, అరాచకాలు బయటకు రాకుండా యాజమాన్యం కార్మికులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. యాజమాన్యాలు లాభార్జనే ధ్యేయంగా, కార్మికులపై పని ఒత్తిడి పెంచి మనస్తాపానికి గురయ్యేలా చేస్తున్నాయన్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.త్రినాథ్, జిల్లా నాయకులు విత్తనాలు పోతురాజు, సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం, మునగపాక: మండలంలోని బ్రాండిక్స్ అపెరల్ సిటీ పరిధిలో ఉన్న తాన్‌యాన్ గార్మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్మికురాలు నక్కా మాధురి ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆందోళన నిర్వహించింది. సంస్థ యాజమాన్యం వేధింపుల వల్లే మాధురి మృతి చెందిందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే కంపెనీలోకి వెళ్లి దర్యాప్తు జరపాలన్నారు. కంపెనీలో చేరిన నాలుగు రోజులకే వేధింపులు తట్టుకోలేక మాధురి ఆత్మహత్య చేసుకుందంటే మిగిలిన కార్మికుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఇలాంటి ఉదంతాలు చాలా జరుగుతున్నా బయటకు రాకుండా అణగదొక్కుతున్నారని ఆరోపించారు. అంతకు ముందు సీఐటీయూ నాయకులు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఆర్.రాము, కోశాధికారి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ బ్రహ్మాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రావి దేముళ్లు మునగపాక మండలం అరబుపాలెంలోని మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మోగిన నగారా

- ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసిన కలెక్టర్
- అమల్లోకి వచ్చిన కోడ్

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నగారా మోగింది. ఈ మేరకు మంగళవారం విశాఖ కలెక్టర్, ఎన్నికల అధికారి హరేందిర ప్రసాద్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆగస్టు 6న విడుదల చేయనున్నారు. కాగా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గతంలో వైఎస్సార్ సీపీ నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ గెలుపొందారు. ఆయన సార్వత్రిక ఎన్నికలకు ముందు జనసేనలో చేరడంతో శాసనమండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. ఈ స్థానానికి గానూ ఇప్పుడు ఉప ఎన్నిక జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లో ఉంటుందని కలెక్టర్

ముఖ్యమైన తేదీలివే..	
ఎన్నికల నోటిఫికేషన్	ఆగస్టు 6
నామినేషన్‌కు చివరి తేదీ	ఆగస్టు 13
నామినేషన్ల పరిశీలన	ఆగస్టు 14
నామినేషన్ విత్‌డ్రా	ఆగస్టు 16
పోలింగ్	ఆగస్టు 30
కౌంటింగ్	సెప్టెంబర్ 3

హెచ్‌ఎంకు చార్జి మెమో


ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈవో

- జూనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు
- యలమంచిలి హైస్కూల్ ఆకస్మిక తనిఖీ
- గైర్హాజరైన వారిపై డీఈవో చర్యలు

యలమంచిలి రూరల్: అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైన యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని, జూనియర్ అసిస్టెంట్లపై జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ చర్యలు తీసుకున్నారు. డీఈవో మంగళవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9 గంటలకు డీఈవో పాఠశాలకు చేరుకునే సరికి హెచ్‌ఎం వి.వి.హిమబిందు స్కూల్లో లేరు. జూ.అసిస్టెంట్ అమ్మాజీ కూడా విధులకు గైర్హాజరయ్యారు. ఇంగ్లిష్ టీచర్ (ప్లస్ వన్) రాధారాణి, 9.40 గంటలకు రావడంతో డీఈవో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం విశాఖపట్నంలో బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన సమావేశానికి వెళ్లారని ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రశాంతి చెప్పడంతో డీఈవో వెంకటలక్ష్మమ్మ హెచ్‌ఎం హిమబిందుకు ఫోన్ చేశారు. విశాఖలో బాలల హక్కుల పరిరక్షణపై జరుగుతున్న విశాఖ జిల్లా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశానికి వెళ్లానని ఆమె చెప్పడంతో డీఈవో మండిపడ్డారు. ఆ సమావేశానికి అనకాపల్లి జిల్లా ప్రిన్సిపాళ్లకు సంబంధం లేదు కదా అని ప్రశ్నించగా హెచ్‌ఎం హిమబిందు నీళ్లు నమిలారు. విధులకు రాని జూ.అసిస్టెంట్ అమ్మాజీ సెలవు చీటి కూడా లేకపోవడంతో డీఈవో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం హిమబిందుకు చార్జి మెమో, జూనియర్ అసిస్టెంట్ అమ్మాజీకి షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్టు డీఈవో చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన ఎలా ఉందని డీఈవో విద్యార్థులను ఆరా తీశారు. వారు చెప్పిన సమాధానాలతో టీచర్ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన డీఈవో.. ఇక్కడ జరుగుతున్న విషయాలను పాఠశాల విద్య ఆర్‌జేడీ దృష్టికి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

క్లుప్తంగా

నేడు ఎంపీపీగా బుల్లి లక్ష్మి ప్రమాణ స్వీకారం



దేవరాపల్లి: ఎ.కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యురాలు చింతల బుల్లిలక్ష్మి దేవరాపల్లి ఎంపీపీగా నూతన ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో ఎంపీపీగా పని చేసిన కిలపర్తి రాజేశ్వరి ఏప్రిల్ 15న వ్యక్తి గత కారణాలతో పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు, వైస్ ఎంపీపీ-1 బుల్లిలక్ష్మికి ఎంపీపీ బాధ్యతలను అప్పగిస్తూ జెడ్పీ సీఈవో ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీపీ ఎన్నిక జరిగే వరకు ఎంపీపీగా బుల్లిలక్ష్మి వ్యవహరిస్తారు.

జీవో 85ను రద్దు చేయాలి



డీసీహెచ్ఎస్ వినతిప్రతం అందిస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి: ఇన్‌సర్వీస్ కోటాలో కేటాయించే సీట్ల సంఖ్యను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.85ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో డీసీహెచ్ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో బాలాజీలకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీజీ వైద్యులు మాట్లాడుతూ కొత్త జీవోతో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇన్ సర్వీస్ కోటాను మునుపటి లాగానే ఉంచాలని కోరారు. సమస్యను పరిష్కరించే వరకూ పోరాడతామన్నారు. ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.ఈ.రాణి, జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతిరావు, వైద్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం పేరిట టోకరా

- రూ.3 లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి: స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని విశాఖకు చెందిన పెదపాటి శర్మ టోపీ వేశాడు. మూడు లక్షల రూపాయలు తీసుకొని ఓ నిరుద్యోగిని ముంచేశాడు. ఈమేరకు తమకు అందిన ఫిర్యాదు వివరాలను పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహమ్మద్ అలీ చెప్పారు. తుమ్మపాల గ్రామానికి చెందిన కోన వరాహ నరసింహమూర్తి మేనల్లుడికి విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని విశాఖకు చెందిన పెదపాటి శర్మ 2021 మార్చి 21న రూ.3 లక్షల నగదు వసూలు చేశాడు. ఉద్యోగం రాలేదు సరికదా.. చెల్లించిన నగదు తిరిగి ఇవ్వకపోవడంతో నరసింహమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

అబద్ధాల అనిత!

- పోలీస్ కార్యాలయంలో హోం మంత్రి అనిత రాజకీయ విమర్శలు
- ఐపీఎస్‌లను పక్కన కూర్చోబెట్టుకొని మరీ వైఎస్సార్ సీపీ పాలనపై ఆరోపణలు
- రాజకీయ వేదికగా మారిపోయిన పోలీస్ సమావేశ మందిరం
- గంజాయి నియంత్రణ, పోలీస్ వాహనాలు, సిబ్బంది సంక్షేమంపై అవాస్తవాలు
- గత అయిదేళ్లలో పోలీసులు పనిచేయలేదన్నట్లు పరోక్ష ప్రకటనలు
- నోరెళ్లబెట్టిన పోలీస్ ఉన్నతాధికారులు

విశాఖ సిటీ: నోరు విప్పితే అబద్ధం. అడ్డూ అదుపూ లేకుండా ఉద్దేశపూరిత విమర్శలు.. ఊహించని పదవి వరించడంతో ఇష్టానుసారంగా రెచ్చిపోయి ఆరోపణలు.. అధిష్టానం మెప్పు కోసం తాపత్రయపడుతూ హడావుడి చేస్తున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సరికొత్త సంప్రదాయానికి తెరలేపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని రాజకీయ వేదికగా మార్చేశారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా సమావేశం పెట్టి.. అదనపు డైరెక్టర్ జనరల్, ఐజీ స్థాయి అధికారులను పక్కన కూర్చోబెట్టుకొని మరీ రాజకీయ దురుద్దేశ ఆరోపణలు గుప్పించారు. వాస్తవాలను కప్పిపుచ్చి, నోటికొచ్చినట్లు అవాస్తవాలను చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో పోలీస్ అధికారులు పనిచేయలేదనట్లు పరోక్ష విమర్శలు చేశారు. పాపం.. ఐపీఎస్ అధికారులు సైతం మంత్రి ఆరోపణలకు అడ్డుచెప్పలేక, నోరువిప్పలేక తలూపడానికే పరిమితమయ్యారు.

గంజాయిపై కప్పగెంతులు



కాపులుప్పాడలో 22వేల కేజీల గంజాయిని దగ్ధం చేస్తున్న అప్పటి సీపీ శ్రీకాంత్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ గంజాయి కేంద్రంగా మారిందని విపరీతంగా ప్రచారం చేశారు. టీడీపీ అధికారం చెపట్టాక గంజాయి నియంత్రణకు 100 రోజుల ప్రణాళిక అంటూ హడావుడి చేశారు. ఇప్పటి వరకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి విశాఖ మీదుగా గంజాయి రవాణ చేస్తున్న వారిని పట్టుకోవడం మినహా.. ఉమ్మడి విశాఖలో ఒక్క చోట కూడా గంజాయి సాగును గుర్తించి ధ్వంసం చేసిన సందర్భాలు లేవు. వాస్తవానికి విశాఖలో ఎక్కడా గంజాయి సాగు లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న పంటలను సైతం గత ప్రభుత్వ హయాంలో గుర్తించి ధ్వంసం చేశారు. ఇదే విషయాన్ని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బాధ్యతలు స్వీకరించిన రోజునే మీడియాతో స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తాను రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలోనే అల్లూరి జిల్లాలో దాదాపుగా గంజాయి సాగును గుర్తించి ధ్వంసం చేసినట్లు చెప్పారు. హోం మంత్రి అనిత మాత్రం అల్లూరి జిల్లాలో గంజాయి సాగు ఎక్కువగా ఉందని ఆరోపణలు చేశారు. అలా ఉంటే.. ఇప్పటి వరకు ఎందుకు వాటిపై చర్య తీసుకోలేదన్నది మాత్రం మిలియన్ డాలర్ ప్రశ్న. ఇదిలా ఉంటే అప్పుడు విశాఖ సీపీ తప్పు చెప్పారా? ఇప్పుడు హోం మంత్రి రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేశారా? అన్నది త్వరలోనే తెలిసిపోతుంది. హోం మంత్రి అనిత అల్లూరి జిల్లాలో ఎన్ని వేల ఎకరాల్లో గంజాయి సాగు జరుగుతుందో గుర్తించి ధ్వంసం చేస్తారో వేచి చూడాలి మరి.

చెప్పేదొకటి.. చేసేదొకటి..

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో అశాంతి నెలకొంది. ఒకవైపు హత్యలు, హత్యాయత్నాలు, కిడ్నాప్‌లు, అత్యాచారాలతో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయింది. మరోవైపు కాలం చెల్లిన మద్యం విక్రయిస్తూ మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ప్రధానంగా విశాఖలో పోలీసులకే రక్షణ లేకుండా పోయింది. అందుకు ఇటీవల వరుసగా పోలీసులపై జరుగుతున్న దాడులే నిదర్శనం. మహిళల భద్రతే తమ తొలి ప్రాధాన్యత అని చెప్పుకొస్తున్న హోం మంత్రి అనిత ఇప్పటివరకు రాంబిల్లి, అనకాపల్లి ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో బాధితులను కనీసం పరామర్శించిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో బాధిత కుటుంబాలకు రూ.లక్షలు నష్టపరిహారం అందించి భరోసా అందించగా.. ఈ టీడీపీ ప్రభుత్వంలో మాత్రం పైసా కూడా విదల్చడం లేదు. అలాగే ఎన్నికల ముందు వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నాణ్యతలేని లిక్కర్ విక్రయిస్తున్నారని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, అనితలు.. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా.. ఇప్పటికీ అదే మద్యాన్ని విక్రయిస్తు న్నారు. కేవలం అధికారంలోకి రావడానికి అప్ప టి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లినట్లు ఇప్పుడు అందరికీ స్పష్టంగా అర్థమవుతోంది. ఇదిలా ఉంటే.. అదే ప్రభుత్వ మద్యం దుకాణా ల్లో కాలం చెల్లిన బీర్లు విక్రయిస్తుండడం ఇప్పు డు సంచలనంగా మారింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టినప్పటికీ.. ప్రభు త్వం గానీ, హోం మంత్రి అనిత గానీ ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు నోరు మెదపకపోవడం గమనార్హం.

సీపీ ఆఫీస్‌లో రాజకీయ విమర్శలా?



కమిషనరేట్‌లో పోలీస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

విశాఖ పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులను పక్కన పెట్టుకొని హోం మంత్రి రాజకీయ ఆరోపణలు చేయడం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి పోలీస్ లేదా ఇతర ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా.. మంత్రులు ఎటువంటి సమావేశాలు నిర్వహించినా.. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావించడం అనవాయితీగా వస్తోంది. రాజకీయ ఆరోపణలు, విమర్శలకు ప్రభుత్వ అతిథి గృహం లేదా వారి క్యాంప్ కార్యాలయాల్లో మీడియా సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. గతంలో సర్క్యూట్ హౌస్‌లో మంత్రులు అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించగా.. రాజకీయ ఆరోపణలు చేసిన సమయంలో అధికారులు వెంటనే వేదికపై నుంచి వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. కానీ హోం మంత్రి అనిత మాత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని రాజకీయ ఆరోపణలకు వేదికగా చేసుకున్నారు. కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ సీపీ ఫక్కీరప్ప, డీసీపీ(క్రైమ్) వెంకటరత్నంలను పక్కన కూర్చోబెట్టుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తిపోయడమే పనిగా పెట్టుకున్నట్లు మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా వాస్తవాలను వక్రీకరించి.. గత ప్రభుత్వ హయాంలో పోలీసులు అసలు పని చేయలేదన్న విధంగా ఆరోపణలు చేయడం గమనార్హం. గంజాయి నియంత్రణ, పోలీస్ అధికారులకు వాహనాలు, ఇతర సదుపాయాలు, సిబ్బంది సంక్షేమం, ఇలా అన్ని విషయాలపై అబద్ధాలు వల్లెవేశారు.

అధునాతన వాహనాలను సమకూర్చినా..



ఇసుజు వాహనాలను ప్రారంభిస్తున్న అప్పటి జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, సీపీ శ్రీకాంత్

పోలీస్ శాఖలో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో కూడా హోం మంత్రి అనిత అబద్ధాలు వల్లెవేశారు. ముఖ్యంగా పోలీసులకు గత ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో వాహనాలు సమకూర్చలేదని, దీంతో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు చేశారు. 2014–19 మధ్య తెలుగుదేశమే అధికారంలో ఉంది. 'అప్పుడెందుకు పోలీసులకు వాహనాలను సమకూర్చలేదు? ఒకవేళ అప్పుడే కొనుగోలు చేస్తే.. వాహనాల కొరత ఎందుకు వచ్చింది? లేదా.. అవి రెండు, మూడేళ్లకే పాడైపోయాయా? మాయమైపోయాయా' అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతాయన్న విషయాన్ని విస్మరించారు. టీడీపీ పాలనలో పోలీసులకు వాహనాలను అందించకపోగా.. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీపై తప్పుడు ఆరోపణలకు పూనుకున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో విశాఖ పోలీసులకు ప్రభుత్వం నుంచే కాకుండా కొన్ని పరిశ్రమలు, సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులతో వాహనాలు సమకూరాయి. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల భద్రత కోసం పూర్తి సాంకేతికతతో కూడిన 163 అధునాతన దిశ పెట్రోలింగ్ వాహనాలను ఆవిష్కరించి విశాఖతో పాటు రాష్ట్రంలో అన్ని జిల్లాలకు కేటాయించారు. అలాగే 32 ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలు, ఒక టోయింగ్, రెండు ఇసుజు వెహికల్స్ అందుబాటులోకి వచ్చాయి. హోం మంత్రి మాత్రం ఒక్క వాహనం కూడా అందించలేదని వాస్తవాలు వక్రీకరించే ప్రయత్నం చేశారు. అలాగే గతంలో పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించినప్పటికీ.. పట్టించుకోలేదని మంత్రి ఆరోపణలు చేశారు.

టీడీపీ నేతల దాడిలో గాయపడిన బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: టీడీపీ నేతల దాడిలో గాయపడిన మున్సిపాలిటీలోని 4వ వార్డుకు చెందిన రౌతు జగదీష్‌కు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. రూ.50 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ద్వారా జగదీష్‌కు అందజేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, వార్డు కౌన్సిలర్ భర్త దాడి బుజ్జి, కౌన్సిలర్ చైతన్య, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, కర్రి శ్రీనివాసరావు, పెట్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



వైస్‌చైర్మన్ రామకృష్ణ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

- అధికారులను నిలదీసిన పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు

నర్సీపట్నం: అధికార, ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరును ఇరు పక్షాలూ ఎండగట్టాయి. అజెండా అంశాలపై వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. చెత్త సేకరణకు వినియోగించే నాలుగు ట్రాక్టర్లలో ఒకదానికి ఇంజిన్ లేదని, మరమ్మతుల పేరుతో నిధులు ఎలా కేటాయిస్తారని అధికారులను నిలదీశారు. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌కు తెలియకుండా అధికారులు అజెండా రూపొందించారని టీడీపీ కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, ధనిమిరెడ్డి మధు, శ్రీకాంత్ ప్రశ్నించారు. 52 పుష్ కాట్లలో 42 మరమ్మతులకు గురైతే పాలకవర్గం ఏం చేస్తోందని, మూడేళ్ల నుంచి మున్సిపాలిటీని సర్వనాశనం చేశారని టీడీపీ సభ్యులు ధ్వజమెత్తారు. దీంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు మండిపడుతూ పంచాయతీ ఎలా ఉండేదో.. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంద అడుగుల రోడ్డు విస్తరణ దగ్గర నుంచి, మున్సిపాలిటీలో రూ.కోట్ల నిధులతో సీసీ రోడ్లు నిర్మించిన ఘనత మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కే దక్కుతుందన్నారు. దీంతో పాలక, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం నెలకొంది. ఈ వాగ్వాదం కాస్తా కొట్లాటకు దారి తీస్తుందన్న అనుమానంతో అప్పటి వరకు బయట ఉన్న సీఐ హరి, ఎస్సైలు సుధాకర్, కృష్ణారావులు కౌన్సిల్ సమావేశ హాల్లోకి ప్రవేశించి, కౌన్సిల్ తీరును పర్యవేక్షించారు. మున్సిపాలిటీలో ఉన్న వాహనాల లెక్క తేల్చాలని, పాలక, ప్రతిపక్ష సభ్యులు అధికారులను నిలదీశారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు, జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య అధికారులపై మండిపడ్డారు. డీజిల్‌లో రూ.5 లక్షల వరకు అధికారులు అవినీతికి పాల్పడ్డారని జనసేన కౌన్సిలర్ ఆరోపించారు. వాహనాల లెక్క తేల్చాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. సభ్యులు అడిగినదానికి అధికారులు జవాబుదారీగా వ్యవహరించాలని హితవుపలికారు. సమావేశంలో కమిషనర్ పూడి రవిబాబు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్కీమ్ పేరుతో మోసంపై ఫిర్యాదు

అనకాపల్లి : చీటీల పేరుతో మోసం చేసిన స్థానిక శ్రీ లక్ష్మీ గణపతి లక్కీ స్కీమ్ ఓనర్ కోరిబిల్లి కాంతారావుపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలివి. స్థానిక కుంచావారి వీధికి చెందిన వి.మల్లికార్జునరావు 2022 అక్టోబర్ మాసంలో కోరిబిల్లి కాంతారావుకు లక్ష్మీ స్కీమ్ పేరుతో నెలకు రూ.3వేలు చొప్పున 33 నెలలు చెల్లించడం జరిగిందని, స్కీమ్‌పూర్తి అయినప్పటికీ నేటికీ నగదు ఇవ్వకపోవడంతో మల్లికార్జునరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

భూవివాదంలో వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన పిల్లా శ్రీనివాసరావు

యలమంచిలి రూరల్ : పట్టణానికి సమీపంలో పెంజెరువు కనకదుర్గమ్మ గుడి దగ్గర మంగళవారం భూవివాదం కారణంగా ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కర్రతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో పట్టణంలోని పాతవీధికి చెందిన పిల్లా శ్రీనివాసరావు(35) తీవ్రంగా గాయపడ్డాడు. శెలంశెట్టి తనకేష్ అనే వ్యక్తి కర్రతో తలపై దాడి చేయడంతో పిల్లా శ్రీనుకు తీవ్ర రక్తస్రావమై ఘటనా స్థలంలో కుప్పకూలిపోయాడు. దీంతో గాయపడిన శ్రీనును బంధువులు యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు యలమంచిలి పట్టణ ఎస్ఐ సావిత్రి మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు.

గంజాయితో పట్టుబడిన ముగ్గురి అరెస్టు

నాతవరం: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు నాతవరం ఎస్ఐ ఎం.రామారావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాకు తెలిపిన వివరాలు. నర్సీపట్నం-తుని మధ్య తాండవ జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌లు తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు ఉన్నాయన్నారు. తమిళనాడుకు చెందిన సంబుల్ తుంబైస్, అరుద్దున్ దుక్కన్, ఐల్‌గోదామురగస్‌లను స్టేషన్‌కు తరలించామన్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

పాపినేనికి రావిశాస్త్రి సాహితీ పురస్కారం



శివశంకర్‌కు పురస్కారం అందజేస్తున్న శ్రీధర్

సీతంపేట(విశాఖ): ప్రముఖ కవి, కథకుడు, విమర్శకుడు డాక్టర్ పాపినేని శివశంకర్‌కు 2024 సంవత్సరానికి రావిశాస్త్రి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మంగళవారం విశాఖ రసజ్ఞ వేదిక, రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రావిశాస్త్రి సాహితీ పురస్కార సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి డాక్టర్ జి.ఆర్.శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారం అందించారు. అనంతరం శివశంకర్ మాట్లాడుతూ రావిశాస్త్రి, కాళీపట్నం ఇద్దరూ ఉత్తరాంధ్ర ప్రజల జీవితాలకు బావుటాపట్టారని కొనియాడారు. రావిశాస్త్రి పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. జి.ఆర్.శ్రీధర్ మాట్లాడుతూ రావిశాస్త్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పేదవాళ్ల పట్ల వకాల్తా పుచ్చుకున్న శ్రీశ్రీ, రావిశాస్త్రి విశాఖ వారు కావడం గర్వకారణమన్నారు. జి.రఘురామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాచకొండ ఉమా కుమార శాస్త్రి, రాచకొండ నృసింహశర్మ, జె.పి.శర్మ పాల్గొన్నారు.

మొదకొండమ్మ మొక్కు తీర్చుకున్న పాడేరు ఎమ్మెల్యే



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు దంపతులను సత్కరిస్తున్న కమిటీ చైర్మన్, సభ్యులు



మొదకొండమ్మను దర్శించుకుంటున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు దంపతులు

మాడుగుల: పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తన సతీమణి జీకే వీధి జెడ్పీటీసీ శివరత్నంతో కలిసి మంగళవారం శాకంబరీదేవి అలంకరణలో ఉన్న మాడుగుల మోదకొండమ్మను దర్శించుకున్నారు. అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడి తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు, భీశెట్టి పైడయ్యనాయుడు, శ్రీనాదు శ్రీనువాసరావులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, అమ్మవారి జ్ఞాపికతోపాటు ప్రసాదాలు అందించి, సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రసాదరావు, ఉత్సవ కమిటీ సభ్యులు కుప్పిలి భవానీశంకర్, ఢిల్లీ నానాజీ, దర్మిశెట్టి అప్పారావు, పల్లెల రాము, శీలామంతుల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ రూ.9 వేలివ్వాలి

- ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వీవీకే రాయ్



సమావేశంలో మాట్లాడుతున్న వీవీకే రాయ్

అనకాపల్లి: ఆర్టీసీలో విశ్రాంత కార్మికులకు కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీవీకే రాయ్ డిమాండ్ చేశారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో అనకాపల్లి డిపో అసోసియేషన్ అధ్యక్షుడు విత్తనాల పోతురాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరలు, వైద్య ఖర్చులను దృష్టిలో పెట్టుకుని విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలన్నారు. ఏటా డీఏ, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ పైడిరాజు రెడ్డి మాట్లాడుతూ కనీస పింఛన్ డిమాండ్‌తో ఆగస్టు 20న రాష్ట్ర వ్యాప్తంగా పీఎఫ్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ విశాఖ రీజినల్ కార్యదర్శి ఏవీ రావు మాట్లాడుతూ ఐక్యంగా పోరాడితే, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు వీవీకే రాయ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిపో కార్యదర్శి ఎన్‌వీవీ సత్యనారాయణ, కోశాధికారి మామిడి విష్ణు, సభ్యులు డి.లక్ష్మణరావు, బుగత శంకరరావు, ఆనందరావు, నారాయణ, ఎస్వీ సత్యవతి, నూకరాజు, టీఎస్ దొర తదితరులు పాల్గొన్నారు.

మను.. చరిత్ర సృష్టించాలి



గోపాలపట్నం స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం విశాఖ క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్ : ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారత షూటర్ మను భాకర్ మూడో పతకాన్ని సొంతం చేసుకోవాలని విశాఖ క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 1900లో తొలిసారిగా భారత్ తరపున ఒకే ఒలింపిక్స్‌లో నార్మన్ రెండు పతకాలను సొంతం చేసుకోగా ఇన్నేళ్లకు మరోసారి చరిత్ర లిఖితమైంది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ షూటింగ్‌లో కాంస్య పతకం సాధించిన భారత షూటర్ మను మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ సరబ్‌తో కలిసి కాంస్యపతకాన్ని సాధించింది. ఇక ఇదే ఒలింపిక్స్‌లో 25 మీటర్ల షూటింగ్‌లోనూ మను పోటీపడుతోంది. ఈ ఈవెంట్‌లోనూ పతకం సాధించి ఒకే ఒలింపిక్స్‌లో మూడు పతకాలు సాధించిన చరిత్ర లిఖించాలని గోపాలపట్నం స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో విశాఖ క్రీడాకారులు ఆకాంక్షించారు.

క్లుప్తంగా

భవిత కేంద్రంలో ఫిజియో సేవల్ని వినియోగించుకోండి



భవిత కేంద్రంలో ఫిజియో సేవల్ని పరిశీలిస్తున్న ఐఈ కోఆర్డినేటర్ శకుంతల

కశింకోట: భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్(ఐఈ) కోఆర్డినేటర్ శకుంతల కోరారు. స్థానిక భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను మంగళవారం పరిశీలించారు. ఫిజియోథెరపిస్ట్ గీతా మౌనిక ఆధ్వర్యంలో మంగళవారం ఇక్కడ ఫిజియో సేవలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ క్లస్టర్ల పరిధిలో ఉన్న 1 నుంచి 18 ఏళ్లలోపు దివ్యాంగ పిల్లలు ఈ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు, ఎంఈవో మూర్తి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బీవీ రమణమ్మ, ఎస్.దీప తదితరులు పాల్గొన్నారు.

పొలంబడిలో నారుమడి సంరక్షణ చర్యలు



పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచనలు చేస్తున్న పీయాబీ రంగాచారి

తుమ్మపాల: వరి నాట్లు వేసే ముందు నారుమడిలో 2 కిలోల సూపర్ పాస్ఫేట్ వేస్తే వేరు కుదుర్లు వదులై, త్వరగా నారు తీసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి పీయాబీ రంగాచారి అన్నారు. మండలంలోని సీతానగరంలో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో వరినార్ల సంరక్షణ, నాట్లపై రైతులకు పలు సూచనలిచ్చారు. నారుమడి యాజమాన్యంలో మెళకువలను తెలిపారు. సూపర్ పాస్ఫేట్ చల్లుకోవడం ద్వారా వరినారు వేర్లు తెగిపోకుండా నాట్లు వేశాక త్వరగా మొన నిలబడుతుందన్నారు. కేజీ కార్బోఫ్యూరాన్ గుళికలు వేస్తే నెల రోజులపాటు వరి పంటను ఆశించే రసం పీల్చే పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జ్యోతిమోహన్, రైతులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

డెడ్‌పూల్ వుల్వరీన్	: రాజా
కల్కి 2898ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
డెడ్‌పూల్ వుల్వరీన్ 3డీ తెలుగు	: సత్యనారాయణ స్క్రీన్-2
రాయన్	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
పురుషోత్తముడు	: వెంకటేశ్వర
రామ్ ఎన్‌ఆర్ఐ	: శ్రీసత్య
ఆపరేషన్ రావణ్	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి: అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 38 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	--	--
మూడోరకం	3,300	3,500

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, మొదటి టీకా తల్లిపాలే. పిల్లలకు అవే అమృత తుల్యం. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో తోడ్పడతాయని వైద్యుల సూచన. శిశువు జన్మించిన వెంటనే వీలైనంత వేగంగా ముర్రుపాలు తాగించాలి. దీంతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే తల్లిపాల ఆవశ్యకతను తెలిపేలా ఏటా ఆగస్టు తొలి వారంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా అనకాపల్లిలో అందుకు ఏర్పాట్లు చేశారు.

అమృతం కన్నా.. అమ్మపాలు మిన్న

- తల్లిపాలు తాగే పిల్లలు బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి, తెలివి తేటలు కూడా ఎక్కువే.
- తల్లిపాలు తాగే బిడ్డలో దవడల కదలిక ఎక్కువ. ఇది శరీరంలోని అన్ని అవయవాలకు మేలు చేస్తుంది.
- బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది.
- పాలిచ్చే తల్లులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల నుంచి రక్షణ లభిస్తుంది.

- రేపటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- తొలి ఆరు మాసాలు తల్లిపాలే బిడ్డకు ఆహారం
- అంగన్‌వాడీల్లో గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు

అనకాపల్లి: మహిళలు గర్భం దాల్చిన నుంచి తల్లి పాల ఆవశ్యకత, బిడ్డ పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. లేనిపోని అపోహలతో అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలను దూరం చేయరాదు. ముర్రుపాలు ఎంత వేగంగా బిడ్డకు తాగిస్తే అంత ఆరోగ్యకరం. ఈ నేపథ్యంలో గర్భిణులకు, బాలింతలకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందుకు ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు అనకాపల్లి పట్టణ పరిధిలోని వార్డులు, అంగన్‌వాడీల వారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. జీవీఎంసీ జోన్ పరిధిలోని 81 అంగన్‌వాడీల్లో 391 మంది పిల్లలు, 35 మంది తల్లులు ఉన్నారు. వీరికి తల్లిపాల ప్రాముఖ్యత తెలిపేందుకు ఉద్యోగులు, ఆయాలు, సూపర్‌వైజర్లు సన్నద్ధంగా ఉన్నారు.

ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి

శిశువు జన్మించిన తొలి రోజుల్లో తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. ప్రొటీన్లు అధికంగా ఉండడంతో వీటిని శిశువు తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శిశువు జన్మించిన తొలి అరగంటలోపే ఈ పాలు పట్టడం ద్వారా చాలా రోగాల నుంచి శిశువును రక్షించుకోవచ్చు. ముర్రు పాలలో విటమిన్ ఏ, బీలతో పాటు తగినంత ఐరన్ విలువలు కూడా ఉంటాయి. ముర్రుపాలు శిశువు ప్రేగులకు బలాన్నిచ్చి, జీర్ణశక్తిని పెంచుతుంది. కామెర్లు, విరేచనాలు వంటి రుగ్మతల నుంచి శిశువును కాపాడుతాయి.



గాంధీనగరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో తల్లులు(ఫైల్)

ఆరు మాసాల వరకు తల్లిపాలే ఆహారం

బిడ్డ పుట్టాక తొలి ఆరు మాసాలు తల్లిపాలే ఆహారం. తప్పని పరిస్థితులు మినహా వేరే ఏ పాలూ బిడ్డకు పెట్టకుండా ఉండటమే మంచిదని వైద్యుల సూచన. మొదటి రెండు నెలల్లో బిడ్డకు రెండు గంటలకోసారి(రాత్రులైనా) పాలు పట్టాలి. రాత్రుళ్లు పాలివ్వడం వల్ల తల్లి మెదడు నుంచి ప్రొలాక్టిన్ ఎక్కువగా స్రవిస్తుంది. ఇది పాల ఉత్పత్తికి కావల్సిన అతి ముఖ్యమైన హార్మోన్. ఎంత రాత్రయినా తల్లి పాలివ్వడం బిడ్డకు క్షేమం. నెలలు నిండే కొద్దీ ఈ వ్యవధి పెంచుకోవచ్చు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలకు ఎంతో రక్షణనిస్తాయి. ఆరు మాసాల తర్వాత బిడ్డకు తల్లిపాలతో పాటు వైద్యుల సూచన మేరకు ఇతర ఆహారం ఇవ్వాలి.

ఆవు పాలు మంచివే.. కానీ..?

కొందరు బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాల కంటే ఆవు పాలే పడతారు. ఇది మంచిది కాదని వైద్యుల సూచ. గేదె పాల కంటే ఆవు పాలలో కొవ్వు శాతం తక్కువ. అందుకే కేలరీలూ తక్కువే. 100 గ్రాముల ఆవు పాలల్లో ఉండే కేలరీలు, 100 గ్రాముల తల్లి పాలల్లో ఉండే కేలరీలతో సమానం. అంతకు మించి తల్లి పాలకు, ఆవు పాలకు ఎలాంటి సారూప్యత లేదు.

శిశువుతోపాటు తల్లికీ ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ముందుగానే అవగాహన కల్పిస్తున్నాం. శిశువు జన్మించాక వీలైనంత త్వరగా ముర్రుపాలు పట్టాలని చెప్తున్నాం. ఇది తల్లీబిడ్డకూ ఆరోగ్యకరం. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు అవసరమైన శక్తి తల్లిపాల ద్వారానే వస్తుంది. తొలి ఆరు మాసాలు, తల్లిపాలు తప్ప వేరే ఏ పాలూ ఇవ్వరాదు. ఏటా మాదిరే ఈ ఏడాది కూడా 1వ తేదీ నుంచి 7 వరకు అంగన్‌వాడీ కేంద్రాలన్నింటా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తాం. – పి.ప్రభావతి, సీడీపీవో, అనకాపల్లి

టెన్త్‌లో ప్రతిభ చూపితే ఉపకార వేతనాలు



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో జరిగిన సభలో విద్యార్థులతో మాట్లాడుతున్న డా.చంద్రశేఖర్

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో వచ్చే ఏడాది టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వనున్నారు. ఈ మేరకు హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు అధ్యక్షతన మంగళవారం స్కూల్లో జరిగిన సభలో పూర్వ విద్యార్థి, వైద్యుడు బి.చంద్రశేఖర్, డా.జ్యోతి దంపతులు ముందుకొచ్చారు. ఉపకార వేతనాల కోసం రూ.2 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీతో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 25న నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నేమ్ బోర్డును సమకూర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

4న విత్తన బంతులు విసిరే కార్యక్రమం

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ 10 వసంతాలు పూర్తయిన సందర్భంగా విశాఖ గ్రీన్ క్లైమేట్ అండ్ వనమాలి గార్డెనర్స్ గ్రూప్ సహకారంతో మండలంలోని సత్యనారాయణపురం ఆలయం వద్ద ఆగస్టు 4న విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు స్థానిక నెహ్రూచౌక్ నుంచి బయలుదేరనున్నట్లు వెల్లడించారు. సభ్యులతోపాటు, పర్యావరణ స్పృహ కలిగిన వారంతా హాజరుకావొచ్చన్నారు.

జీవితంలో అత్యంత విలువైనది స్నేహం



స్నేహితుల దినోత్సవ వేడుకల్లో ఇస్కాఫ్ ప్రతినిధులు

అనకాపల్లి: హింసను తిరస్కరించి విలువలు, శాంతితో కూడిన మెరుగైన సమాజ నిర్మాణం కోసం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకలు నిర్వహించినట్లు ఇస్కాఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మళ్ల మాధవరావు అన్నారు. స్థానిక వై.విజయకుమార్ హాల్లో ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్(ఇస్కాఫ్) ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి, రంగు, లింగ, ప్రాంత, మత, భాషా బేధాల్లేకుండా వివిధ దేశాల ప్రజల మధ్య బలమైన స్నేహం ఏర్పడాలనే సదుద్దేశంతో 2011లో యూఎన్‌వో జనరల్ అసెంబ్లీలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించాలని అధికారికంగా ప్రకటించారన్నారు. స్నేహం అనేది ప్రపంచంలో అత్యంత విలువైన సంబంధంగా పేర్కొన్నారు. మనిషి పుట్టుక నుంచి మరణించే వరకు ఎవరు తోడున్నా లేకపోయినా స్నేహం మాత్రం చివరి వరకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇస్కాఫ్ అనకాపల్లి ఉపాధ్యక్షుడు దాడి శివరాం, సభ్యులు మొల్లి రమణబాబు, బొట్ట చిన్నియాదవ్, ఎంఆర్ఎస్ ప్రకాశరావు, మళ్ల చక్రవర్తి, రాజాన దొరబాబు, వైఎస్ భద్రం, తాకాశి వెంకటేశ్వరరావు, పొలిమేర సత్యనారాయణ, డి.జగదీష్, కోన లక్ష్మణ్, కోరుబిల్లి శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలువల బ్రిడ్జిలపై రక్షణ గోడలు నిర్మించాలి

అనకాపల్లి: పట్టణ పరిధిలో కాలువలపై నిర్మించిన ప్రధాన బ్రిడ్జిల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలో నాగులాపల్లి కాలువతో పాటు ఇతర కాలువల బ్రిడ్జిలను మంగళవారం ఆయన పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. ఈ బ్రిడ్జిల మీదుగా నిత్యం వందలాది వాహనదారుల, స్థానిక ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని, ప్రమాదాలు జరగక ముందే ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అనకాపల్లి: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మండలంలోని సీతానగరానికి చెందిన గంగుపాం దిలీప్ కుమార్(23) మంగళవారం మృతి చెందినట్లు రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు అందింది. రూరల్ హెచ్‌సీ సోంబాబు తెలిపిన వివరాలు. సీతానగరం గ్రామానికి చెందిన గంగుపాం దిలీప్‌కుమార్ దుబాయ్‌లో ఉంటున్నాడు. రెండు మాసాల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం ధాన్యం బస్తాలకు ఎలుకల మందు పెట్టి, అదే చేతితో గారెలు తినడంతో స్పృహతప్పి పడిపోయాడు. హుటాహుటిన ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్చారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించినట్లు మృతుని తండ్రి కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వెల్లడించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

అనకాపల్లి: మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తున్న మునగపాక గ్రామానికి చెందిన దొడ్డి వెంకటరమణపై పట్టణ హెచ్‌సీ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. హెచ్‌సీ తెలిపిన వివరాలు. సోమవారం రాత్రి రింగ్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాపల్లి నుంచి మునగపాకకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వెంకటరమణ వద్ద 10 క్వార్టర్ బాటిళ్ల మద్యం దొరికిందన్నారు. దీంతో మద్యంను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వెల్లడించారు.

దళిత కాలనీల అభివృద్ధికి కృషి



పౌరుహక్కుల దినోత్సవం మాట్లాడుతున్న డీటీ శ్రీరామమూర్తి

తుమ్మపాల: దళిత కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని, వారి హక్కులకు రాజ్యాంగ పరమైన రక్షణ కల్పించేందుకు కృషి చేస్తామని డీటీ శ్రీరామమూర్తి తెలిపారు. మండలంలోని మారేడుపూడిలో మంగళవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయనతో పాటు ఈవోపీఆర్డీ ధర్మారావు, సర్పంచ్ సాలాపు కనకరాజు, ఈవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు పాల్గొన్నారు. స్థానిక సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిగా వాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామంలో తాగునీటి వసతి లేదని, కొండపైనున్న వాటర్ ట్యాంక్‌కి కనెక్షన్ ఇవ్వలేదని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, మాజీ ఎంపీటీసీ రేబాక ప్రసాద్, జైభీమ్ సేన సెక్రటరీ కె.రాము, వీఆర్వో రాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాయుడు

తుమ్మపాల: పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుని, ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు తీసుకోవాలని స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సూరిప్రభ, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ నాయుడు సూచించారు. మండలంలోని తుమ్మపాల శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి ఆధ్వర్యంలో ఈబీఐ పైలట్ ప్రాజెక్టు-విశాఖ, సంధ్య ఐ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో స్త్రీలు, పిల్లలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. మొత్తం 150 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు మధు, సంస్థ సెక్రటరీ కర్రి జోగినాయుడు, మహిళలు పాల్గొన్నారు.

నూతలగుంటపాలెంలో పౌర హక్కుల సభ



పౌర హక్కుల దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషుబాబు

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పౌరుల హక్కుల గురించి వక్తలు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.శేషుబాబు కాలనీలో నెలకొన్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. పక్కా డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కలిగెట్ల నూకరత్నం, ఈవోఆర్డీ ఎం.సోమవారం, ఏఎస్ఐ కె.దొర, హాస్టల్ వార్డెన్ నిర్మల, పంచాయతీ కార్యదర్శి డి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేలా బోధన

ఆర్జేడీ విజయభాస్కర్



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ భాస్కర్

సబ్బవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేలా బోధన సాగాలని ఆర్జేడీ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల,నక్కలవానిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆర్జేడీ విజయభాస్కర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నక్కవానిపాలెం పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.అనంతరం మండల పరిషత్ సమావేశమందిరంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం,వెనుకబడిన విద్యార్థుల గుర్తింపు,వారిపై ప్రత్యేక శ్రద్ధ, విద్యా ప్రమాణాల పెంపు,విద్యార్థుల్లో నైతిక విలువలు కల్పించడం వంటి వాటిపై ఆయన ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ, ఎంఈవోలు లక్ష్మణరావు,బి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మతల్లి పండగ



పరదేశమ్మ తల్లిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: అరబుపాలెంలో మంగళవారం పరదేశమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయంనుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. కాగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు విజయకుమార్, ప్రసాద్‌లను పుష్పగుచ్ఛాలు,శాలువాలతో సత్కరించారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు,కూటమి నేతలు దొడ్డి శ్రీనివాసరావు, జనపరెడ్డి శ్రీనివాసరావు,టెక్కలి పరశురామ్, బొడ్డేడ గంగాధర్,శరగడం యోగి నాగేశ్వరరావు,కృష్ణ పాల్గొన్నారు.

నువ్వుల రైతుకు తీవ్ర నష్టం

కోటవురట్ల : వర్షాలు నువ్వుల రైతులను నష్టాల పాలు చేశాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో పలు ప్రాంతాలలో నువ్వుల పంట నీట మునిగింది. ఎక్కువ కాలం నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ఊటకు చేలు దెబ్బతిన్నాయి. సరిగ్గా పక్వానికి వచ్చిన దశలో అకాల వర్షాలు నష్టాన్ని కలిగించాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని పాములవాక, భీమిరెడ్డిపాలెం, పి.కె.పల్లి, రామన్నపాలెం చినబొడ్డేపల్లి, లింగాపురం, తంగేడు, జల్లూరు, అన్నవరం ప్రాంతాలలో నువ్వుల పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకుని, పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు మంగళవారం అడ్డుకొన్నారు. సబ్బవరం సర్వే నెంబర్ 286లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు కొందరు ప్రయత్నించారు. దీంతో సమాచారం అందుకున్న డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఆర్ఐ వీరయ్య, వీఆర్వో నూకరత్నం మిగిలిన సిబ్బందితో కలిసి ఆ స్థలం ప్రభుత్వానిదిగా పేర్కొంటూ, ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవన్న హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల్ని ఆక్రమించేందుకు ఎవరు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పడమటమ్మలోవలో కలిసిన నరసింగబిల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి హైస్కూల్‌కు చెందిన 1987–88 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు 11 ఏళ్ల విరామం తర్వాత మంగళవారం విసన్నపేట పడమటమ్మలోవలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. కుటుంబ పరిస్థితుల్ని పరస్పరం తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహ విద్యార్థి మిత్రులకు సాయం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కేవీఎల్ గాంధీ, అండె రమణ, ఆర్.నందగోపాల్, మజ్జి ఫణీషు, డి.శంకరరావు, వై.వెంకటరావు, ఐఎస్ఎస్ రాజు, కోన నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం : సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి వసంత్‌కుమార్ సూచించారు. మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం డెంగీ, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వసంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం నీరు పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాల వల్ల కొత్త నీరు వచ్చే సమయంలో కలుషిత నీరు తాగే ప్రమాదమున్నందున కాచి, చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, అవసరమైన దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కుష్టు వ్యాధి, అతిసార పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వేడి ఆహారాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు. ఎటువంటి అనారోగ్యం తలెత్తినా వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేశ్, వైద్య సిబ్బంది గాయత్రి, దేముడమ్మ, ముకేశ్, నాగేశ్వరరావు, శిరీష, గణపతి పాల్గొన్నారు.